ఉగాది కథల పోటీలో మూడవ బహుమతి రూ. 200 పొందిన కథ

పసుపు కుంకుమలు

జి. ఉషావిఠల్

భోజనం చేసి, విస్తరాకుల్ని పారేయడానికి వీధిలోకి వచ్చిన అన్నపూర్ణమ్మ—

"ఏవండోయ్! మీ మాణిక్యాంబగారు పోయారట!" అంటూ పక్కింటావిడ పలకరించి చెప్పగానే, తన చెవుల్ని తనే నమ్మలేక ఆశ్చర్యంగా, "ఏవిటీ?" అనడిగింది.

"అవునండీ! ఇందాక మా అబ్బాయిని కొబ్బరికాయ పత్రమ్మని బజారుకి పంపించాను. వాడు వస్తూ, వాళ్ళింటిముందు జనం నిల్చుని వుండటం చూసి, వెళ్ళి కనుక్కున్నాడట...." ఆవిడ మాట పూర్తి చెయ్యలేదు. అన్నపూర్ణమ్మ సుడిగాలిలా యింట్లోకి ప్రవేశించి—

"ఇదిగో! మిమ్మల్నే! ఇది విన్నారా? మా మాణిక్యంవదిన పోయిందట!" అని భర్తని కేకేసింది. భోజనంచేసి, వాలు కుర్చీలో విశ్రాంతిగా పడుకుని, ప్రొద్దుట వొకసారి చదివిన పేపర్నే మరోసారి తిరగేస్తున్న సూరప్పగారు భార్య కేకలకి తుళ్ళిపడ్డాడు.

"నీకేవన్నా మతిపోయిందేవిటే? పొద్దున్న బజార్నించి వస్తూ మీ సత్యం అన్నయ్యని పలకరించే వచ్చాను. అప్పుడు ఆవిడ కూర తరుక్కుంటూ నడవలో కూర్చుని వుంది. 'శారద దగ్గర్నించి వుత్తరాలు వస్తున్నాయా?' అని కూడా అడిగింది. ఆవిడ పోవడమేవిటి? నువ్వు పొరపాటు విని వుంటావు!" అన్నారు ఖంగారుగా. అన్నపూర్ణమ్మ ఆ మాటకి సమాధానం చెప్పేలోపునే, మాణిక్యాంబగారి మనవడు పదహారేళ్ళ రామం గుమ్మంలో కొచ్చి.

"మా బామ్మగారు పోయారండీ! ఈ మాట మీతో చెప్పిరమ్మన్నారు నాన్నగారు." అన్నాడు.

"నాయనా రామం! ఐతే నేను విన్నది నిజమేనా? అయ్యో! వదినా!" అంటూ అంటు చెయ్యన్నా కడుక్కోకుండా అన్నపూర్ణమ్మ గోడకి చేరగిలబడి యేడవటం మొదలుపెట్టింది.

"పొద్దున నేను మీ తాతయ్యతో మాట్లాడుతుంటే కూర తరుక్కుంటూ అక్కడే వుంది గదుటోయ్! ఇంతలో ఏం ముంచుకు వచ్చింది?" సూరప్పగారి ప్రశ్నకి సమాధానంగా రామం –

"నేనూ యింట్లో లేనండీ, భోజనం చేసి ఫ్రెండింటికి వెళ్ళాను. నేను వెళ్ళేదాకా బామ్మ

బాగానే వుంది. నిన్న శనివారం ఉపవాసం కదా, అందుకని మాతోనే భోజనం చేసింది. భోజనంచేసి, తమలపాకులు వేసుకుంటూ వుంటే యెక్కిళ్ళు వచ్చాయట! అసలు బామ్మ పోయిన సంగతి ముందు యెవరూ గమనించలేదట! నడవా తలుపుకి జారగిలపడి కళ్ళు మూసుకు కూర్చున్నట్టు వుంటే అమ్మ, "లోపలికివెళ్ళి పడుకోండి అత్తయ్యా!" అంటూ కుదిపేసరికి అలాగే వాలిపోయిందట. వెంటనే డాక్టర్‌కి కబురంపేరట. నేను ఫ్రెండింటి నించి, యింటికి రాగానే నాన్న సైకిల్‌మీద వెళ్ళి, "వూళ్లోని బంధువులందరికీ యీ మాట చెప్పి రారా!" అంటూ తరిమేరు. ఇంకా మా అమ్మమ్మ గారింటికి వెళ్ళాలి. వస్తానండీ!" అంటూ వెళ్లి పోయాడు.

"ముందా అంటు చెయ్యి కడుక్కుని బయల్దేరు. వెళ్ళి చూసొద్దాం!"

"లేచినవేళ యెలాంటిదో! ఎంత మాట వినాల్సి వచ్చిందీ!" అనుకుంటూ భార్యాభర్తలు సత్యన్నారాయణగారింటికి బయలుదేరారు. మాణిక్యాంబ, అన్నపూర్ణమ్మకు స్వంత వదిన కాదు. ఆమె వేలువిడిచిన అన్నగారి భార్య. వాళ్ళిద్దరికీ బంధుత్వం కంటే స్నేహమే యెక్కువ! ఇద్దరూ వొకే యీడు వాళ్ళవటం చేత కలిసినప్పుడల్లా తమ, తమ కష్టసుఖాలు కలబోసుకుంటూ వుండేవారు. మాణిక్యాంబది పెద్ద సంసారం! ముగ్గురు కొడుకులూ, ఇద్దరు కూతుళ్ళూనూ! కొడుకులు ప్రయోజకులయ్యేదాకా కాస్త యిబ్బందులు పడ్డా, ప్రస్తుతం వాళ్ళ పరిస్థితి బాగానే వుంది. కూతుళ్ళకీ, కొడుకులకీ అందరికీ వివాహాలయిపోయాయి. ముగ్గురు కొడుకుల్లోనూ, ఆఖరివాడు మాత్రం వుద్యోగరీత్యా దూరాన వుంటున్నాడు. మిగిలిన యిద్దరూ, స్వంత వూళ్లోనే చిన్న చిన్న వుద్యోగాలు చేసుకుంటూ, వున్న కొద్దిపాటి ఆస్తినీ సంరక్షించుకుంటూ తల్లిదండ్రులతో వుంటున్నారు. అన్నపూర్ణమ్మకి ఒక్కర్తే కూతురు శారద! అల్లుడు ఉత్తరాదిలో యింజనీరు. సూరప్పగారు కాలంలో కలప వ్యాపారంచేసి బాగా గడించారు. ఉన్న వూళ్లో లంకంత కొంప, అన్నపూర్ణమ్మ ఒంటి నిండా బంగారం, బేంకులో ఫిక్సెడ్‌లో యాభై వేల దాకా రొఖ్ఖం కాక పదెకరాల పొలం, తోటలూ వగైరాలన్నీ వున్నాయి. వాళ్ళకున్న లోటల్లా యింత ఆస్తికీ వారసుడు లేకపోవడమే! ఏనాటికైనా కూతురి కొడుకుని తెచ్చుకుని తమ దగ్గర అట్టే పెట్టుకుని ఆస్తి అప్పజెప్పాలని వాళ్ళ ఆలోచన.

*

పచ్చగా పసుపు రాసుకున్న ముఖాన కాణీ కాసంత ఎర్రని కుంకం బొట్టు, తమలపాకులతో పండిన యెర్రని పెదాలు, గుంటూరు నేత చీరలో–మాణిక్యాంబ నిద్రపోతున్నట్టే వుంది.

"ఇంత పసుపు కుంకుమలతో పోవడం కంటే ఆడదానికింకేం కావాలి? ఎంత పుణ్యం చేసుకొని వుండాలి! ఇలాంటి చావు రావడం అంటే మాటలా!"

"ఏమైనా మాణిక్యాంబ మనసు మహా దొడ్డది! కోడళ్ళనీ కూతుళ్ళలాగే చూసుకుంది. ఈనాటిదాకా కోడళ్ళని వంటింటికేసి రానిచ్చేదేవిటి? ఒక్క పొల్లు మాట యెరుగదు కదా! మహా యిల్లాలు!" చుట్టూ చేరిన అమ్మలక్కలు చెప్పుకుంటున్నారు. అన్నపూర్ణమ్మ కళ్ళు వత్తుకుంటూ, సత్యన్నారాయణగారిని సమీపించి—

"రాయిలాంటి మనిషి! ఒక రోగమా? రొష్టా? ఎంతలో యెంత ముంచుకు వచ్చిందన్నయ్యా!" అంటూ పలకరింపుకి దిగింది.

"భోజనం చేసి, తాంబూలం నవుల్తూ గడప దగ్గర కూర్చునుందమ్మా! ఇంతలో యెక్కిళ్ళు మొదలయాయి. ఎవరో కేకేస్తే, "వెళ్ళి మంచి నీళ్ళు తాగు!" అని వీధిలోకి చక్కాపోయాను నేను. ఒక్క క్షణం ఆగి, వెనక్కి తిరిగి చూడనన్నా చూశాను కాదు. ఎప్పుడు ఆ పక్షి యెగిరి పోయిందో? యెవరికీ తెలీదు. పెద్దకోడలు, తలుపుకి జారగిలబడి, కళ్ళు మూసుకుని కూర్చుని వుండటం చూసి, లోపల పడుకోమని చెబ్దామని చెయ్యి వేసేసరికి యేముంది? అంతా అయిపోయింది! 'ఈ కోపిష్టి మనిషితో వేగలేనమ్మా!' అంటూ వుండేది. వేగలేక వేగం వెళిపోయిందేమో!" అంటూ వుత్తరీయం ముఖానికి అడ్డు పెట్టుకుని రోదించసాగేరు సత్యనారాయణగారు. సూరప్పగారు, ఆయన భుజం తడుతూ—

"ఊరుకో! ఎంత యేడిచినా పోయిన మనిషి తిరిగి రాదు. నిజానికి ఎంతో పుణ్యాత్మురాలావిడ! అనాయాస మరణం అందరికీ వస్తుందా?" అంటూ వోదార్చేరు.

చీకటి పడకుండా జరగాల్సిన కార్యక్రమం జరపాలని ఎవరో హెచ్చరించడంతో, నలుగురూ మాణిక్యాంబ అంత్యక్రియలకి ప్రయత్నం చెయ్యసాగారు. దూరాన వున్న చిన్న కొడుకూ, కూతుళ్లు రాలేదనేగాని, హఠాత్తుగా పోయిన మాణిక్యాంబకి, అయినవాళ్ళూ, బంధువులేగాక, వీధి వీధంతా కన్నీటితో వీడ్కోలిచ్చారు.

*

ఆ రోజు చీకటి పడ్డాక ఇంటికి చేరుకున్న ఆ దంపతులకి, వంట చేసుకుని భోజనం చెయ్యాలన్న ధ్యాస కలగలేదు. ఇద్దరూ స్నానాలు చేసి, రెండు పళ్ళు తిని మజ్జిగ తాగి పడుకున్నారు. అన్నపూర్ణమ్మకి, కన్నుమూసినా, తెరిచినా కళకళలాడి పోతూ ఇన్ని పువ్వులూ, పసుపూ కుంకుమలతో పెళ్ళికూతురిలా వెళ్ళిపోయిన మాణిక్యాంబ రూపమే కళ్ళకు కట్టినట్టుంది.

'ఏమైనా వదిన అన్నివిధాలా అదృష్టవంతురాలు. రామలక్ష్మణుల్లాంటి కొడుకులూ, ఇంటి నిండా కలకల్లాడుతూ గిలిగిచ్చకాయల్లాగ మనమలూ, మనవరాళ్ళూనూ! అంతకంటే ఆడదానికి కావలసిందేముంది?' అనుకుంది అన్నపూర్ణమ్మ. ఆ మాటే అప్పుడప్పుడు తను ఆవిడతో అంటే ఆవిడ ఒప్పుకునేది కాదు.

"ఏమి అదృష్టంలే వదినా! చాకిరీ చెయ్యలేక ఛస్తున్నానంటే నమ్ము!' మీ అన్నయ్య కోపం, ఛాదస్తం నీకు తెలీనివా? పొద్దున్న పూజకి, జపానికి అన్నీ అమర్చి వుంచకపోతే ఆయన ఎగరటం మొదలు పెడతారు. పదిన్నరయేసరికి మడిగా భోజనం లేకపోతే చిందులు తొక్కేస్తారు గదా! ఇవన్నీ కోడళ్ళకి గిట్టవు. మనకాలం కాదు! మొగుడి అడుగుకి మడుగులొత్తుతూ గడగడలాడి పోతూ చాకిరీ చెయ్యడానికి. భోజనం చేసి వక్కపొట్లం విప్పుకుని, వేసుకోవడానికి కూడా బద్ధకమే ఆయనకి! వంటింట్లో ఎంత పనిలో వున్నా, వచ్చి ఆయనకి వక్కపొట్లం విప్పి చేతిలో వెయ్యాల్సిందే! ఇవన్నీ ఈ కాలం వాళ్ళకి కిడతాయా? ఆయన కోపానికి తగ్గట్టూ నడుచుకుంటూ, ఇటు కొడుకులకి, ఆయనకీ మధ్య గొడవలు రాకుండా, కోడళ్ళకి మనసు నొవ్వకుండా వుంచాలంటే నేను చక్రంలా తిరిగి చాకిరీ చేస్తే గానీ జరగదు." అంటూ వాపోతూ వుండేది. పైగా,

"నీకేవిటి లోటు అన్నపూర్ణా! అపురూపంగా చూసుకునే భర్త! ముత్యంలా కూతురూ, మనవలూ! ఇంటి కింబెడు ఆస్తి, వంటికి వంబెడు

ఈ కథ రాసిన శ్రీమతి జి. ఉషావిఠల్ భర్తతో పాటే, బెంగళూర్లోని నేషనల్ ఏరో నాటికల్ లేబరేటరీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ఆమె స్వస్థలం-శ్రీకాకుళం జిల్లాలోని పాత్రుని వలస గ్రామం. చలనచిత్ర రచయితగా ప్రసిద్ధులైన కీ. శే. వెంపటి సదాశివబ్రహ్మంగారి అమ్మాయి - ఉష. ఆమె చదువు మద్రాసులోనే సాగింది. ఎతిరాజ్ కళాశాలలో బి. ఎ. చదివారు. శ్రీమతి ఉషావిఠల్ 1962 లో తొలి కథ రాశారు-అది 'ఆంధ్రప్రభ' వార పత్రికలో అచ్చయింది. అప్పట్నుంచి, ఎక్కువగా కాకపోయినా అప్పుడూ అప్పుడూ వివిధ పత్రికల్లో కథలు రాశారు. సహజత్వానికి దగ్గరగా వుండే కథలన్నా, పుస్తకాలన్నా, లలిత సంగీతం అన్నా - ఆమెకు ఇష్టం. ఉషా - విఠల్ దంపతులకు ఒక అబ్బాయి, ఒక అమ్మాయి-సంతానం.

బంగారం!" అనేది. అదృష్టానికి నిర్వచనం డబ్బు వుండటమా? ఈ రోజు మాణిక్యాంబ పోయినప్పుడు చుట్టూ చేరిన ఆవిడ కొడుకుల్ని, కోడళ్ళని, మనవల్ని చూస్తూవుంటే, వాళ్ళ దుఃఖం వింటే, డబ్బుతో ఆ ప్రేమని కొనగలమా అని అనిపించ లేదూ తనకి? రేపు తను పోతే? అవును! తను కూడా హఠాత్తుగా మాణిక్యాంబలాగ పోతే తన కెవరున్నారు? భర్త తప్ప! దూరాన వున్న కూతురు యెప్పటికి వచ్చేను?

హఠాత్తుగా అన్నపూర్ణమ్మకి యెప్పుడూ కలగని దిగులు, భయం—మనసునిండా అలము కున్నాయి. కళ్ళల్లో తిరిగిన నీటిని చీర కొంగుతో వత్తుకుని, అప్పుడే నిద్రలోకి జారిన భర్తవైపు తిరిగింది అన్నపూర్ణమ్మ. తనకెందుకింత దిగులు కలుగుతోంది? మాణిక్యాంబ చెప్పినట్టు అపురూపంగా చూసుకునే తన భర్త, తను కన్ను మూస్తే పదిమంది కొడుకులకన్నా, మనవలకన్నా దుఃఖిస్తాడు. తనకే లోటూ జరగకుండా అంతా సక్రమంగా జరిపిస్తాడు. మగపిల్లలు లేనంత మాత్రాన తను దురదృష్టవంతురాల్నని వాపోవడం అనవసరం! 'ఒకవేళ ఆయనే ముందుపోతే? ఛా! ఛా! ఆయన ముందు పోవడమేమిటి! ఏం? ఎందుకు పోకూడదూ? చావుబ్రతుకులు మనుషుల చేతుల్లో వున్నాయా? ఛీ! ఛీ! ఏమిటివాళ యిలాంటి విపరీతమైన ఆలోచనలు వస్తున్నాయి?' అనుకుంటూ యెటో పరిగెడుతున్న మనసుని మరో వైపుకి మళ్ళించడానికి విశ్వప్రయత్నం చేసి ఓడి పోయింది అన్నపూర్ణమ్మ. ఆవిడకి వరసగా తన బంధుకోటిలోని అనేకమంది పూర్వ సువాసినులు జ్ఞాపకం రాసాగేరు. వాళ్ళ, వాళ్ళ భర్తలు పోయిన ఘట్టాలు, ఆ తర్వాత పదో రోజు తంతు మొదలైన విషయాలన్నీ గుర్తుకి వచ్చి అన్నపూర్ణమ్మకి శరీరంలో ఒక విధమైన వణుకులాంటిది పుట్టుకు వచ్చింది. ఉన్నట్టుండి భర్త గుఅక ఆగిపోయి నట్టనిపించి, విపరీతమైన భయంతో వణుకుతున్న చేతిని భర్త గుండెల మీద వేసింది. సూరప్పగారా స్పర్శకి కదిలి, "ఇంకా పడుకోలేదూ?" అని ప్రశ్నించి, అన్నపూర్ణమ్మ సమాధానానికి యెదురు చూడకుండా, మళ్ళీ నిద్రలోకి జారిపోయారు. అన్నపూర్ణమ్మ గాఢంగా నిట్టూర్చి, నిద్రపోవడానికి చేసే ప్రయత్నంగా మరోవైపుకి వత్తిగిల్లింది. ఏనాడూ లేని వంటరితనం ఆవిడని చుట్టుముట్టింది. చావు యెవరికైనా చెప్పి వస్తుందా? నిన్న యీపాటికి నలుగురి మధ్యా, హాయిగా నిద్రపోయిన మాణిక్యం వదిన, యీ రోజు యీ వేళకి లేదు. విచిత్రంగాదూ? ఏమిటీ ఆలోచనలు? భర్త పోతే అనే ఆలోచనెందుకు తనకి కలుగుతోంది? తను పోతేనో అని తన కెందుకు అనిపించడంలేదూ? మనసు యిలా పరిగెట్టడం. ముందు జరగబోయే సంఘటనలకి సంకేతం కాదుకదా? "భగవాన్! నన్ను వంటరిదాన్ని చెయ్యకు! మాణిక్యం వదిన లాగే, ఆయన వుండగా పసుపు కుంకుమలతో పోయే అదృష్టాన్ని నాకు కలిగించు. నిన్నింకేమీ కోరను. ఆయన లేకుండా నేను బ్రతకలేను. ఆ జీవితాన్ని నేనసలు వూహించుకోలేను కూడా!" అన్నపూర్ణమ్మ చీకట్లో రెండు చేతులూ జోడించి, భగవంతుడ్ని వేడుకుంది. తెల్లారిగట్ల చిన్న కునుకు పట్టిన ఆవిడకి, బ్రతికున్న భర్తృహీనలూ, చనిపోయిన పుణ్యస్త్రీలూ కలగాపులగంగా కలల్లో కనిపించి మరింత మనసుని బాధించారు.

*

పనిమనిషి, "అమ్మగారూ!" అని పిలుస్తూ తలుపు తడుతూవుంటే చటుక్కున మెలుకువ వచ్చింది అన్నపూర్ణమ్మకి. లేచి, మంగళ సూత్రాలు కళ్ళ కద్దుకుని, మంచం దిగి పనిమనిషికి తలుపు తీయడానికి వీధి గుమ్మంవైపు వెళ్ళబోయి, భర్త మూలుగు విని గాభరాగా భర్త మంచం దగ్గరకి వెళ్ళి "ఏమండీ!" అని పిలుస్తూ వంటి మీద చెయ్యి వేసింది. సూరప్పగారి వళ్ళు సలసల కాగి పోతోంది,

"ఒళ్ళంతా నొప్పులుగా వుంది. కాస్త జ్వరం కూడా తగిలినట్టుంది. నిన్న-వేళగాని వేళ చేసిన స్నానం వల్ల వచ్చి వుండొచ్చు. కాఫీతో ఏదైనా మాత్ర వేసుకుంటే అదే తగ్గిపోతుంది." అన్నారు సూరప్పగారు మూలుగుతూ. అన్నపూర్ణమ్మకి కాళ్ళూ చేతులూ ఆడలేదు. నిన్నటి షాక్ నించి ఆవిడింకా తేరుకోలేదు.

"మాత్ర కాదు. డాక్టర్‌గారికి కబురు పంపి స్తాను." అంటూ భర్త వారిస్తున్నా వినకుండా పని మనిషికి తమకి వాడుకగా వైద్యం చేసే డాక్టర్ గారింటికి పంపించి, తను మొహం కడుక్కుని కాఫీ తయారు చెయ్యసాగింది. యాంత్రికంగా పనులు చేస్తున్నా ఆవిడ మనసు, మనసులో లేక పోవటం వల్ల పాలు పొంగిపోయాయి. ఫిల్టర్ చెయ్యి తగిలి పడిపోయి డికాషనంతా నేలపాలై పోయింది. "దేముడా! రాత్రి నా వెర్రి మొర్రి ఆలోచన లేమిటి? తెల్లారేసరికి ఈయనకీ జ్వరం ముంచుకు రావడం ఏమిటి? అమ్మా! పార్వతీదేవీ! నీకు శుక్రవారం ఆయన పేరున కుంకుమార్చన చేయిస్తాను. ఆయన ఆరోగ్యవంతులు అయేటట్టు ఆశీర్వదించు తల్లీ! నీ అంతటి పసుపుకుంకుమల్ని నాకు ఇయ్యవేదేవీ!" కన్నీళ్ళతో పార్వతీ దేవికి మొక్కుకుంది అన్నపూర్ణమ్మ. డాక్టర్‌గారు వచ్చేసరికి సూరప్పగారు నెమ్మదిగా లేచి, మొహం కడుక్కుని కాఫీ తాగారు. డాక్టర్‌గారు పరీక్ష చేసి, ఆదుర్దాగా తనవైపే చూస్తున్న అన్నపూర్ణమ్మతో, "మరేం ఖంగారు లేదమ్మా! మామూలు ఫ్లూ జ్వరం లాంటిది. ఈ మాత్రలు మూడు పూటలు వాడండి. సాయంత్రానికి తగ్గిపోతుంది. మళ్ళీ రేప్పొద్దున్న వచ్చి చూస్తాను." అన్నారు.

"ఈ మాత్రం జ్వరానికి డాక్టర్‌గార్ని ఇబ్బంది పెట్టడం ఎందుకే—అంటే వినకుండా మీకు కబురెట్టింది. పట్టి బంగారు మనిషి! వేళగాని వేళ స్నానం చెయ్యడం చేత కాస్త నజ్జించినట్టుంది" అన్నారు సూరప్పగారు.

"ఇబ్బందేముంది లెండి. ఈ పూట జావ కాచి ఇవ్వండమ్మా!" అంటూ డాక్టర్‌గారు వెళ్ళిపోయారు. డాక్టర్ ధైర్యం చెప్పినా, భర్త బాగానే మాట్లాడుతున్నా, ఏదో తెలీని భయం, దిగులు అన్నపూర్ణమ్మని చుట్టుముట్టాయి. భర్తకి జావ కాచియిచ్చి, తనూ అదే తాగి వూరుకుంది. డాక్టర్‌గారు చెప్పినట్టు ఆ రోజు సాయంత్రానికి కాకపోయినా, మర్నాటి సాయంత్రానికి సూరప్పగారి జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. ఆ శుక్రవారంనాడు అనుకున్నట్టు అమ్మవారికి శ్రద్ధగా కుంకుమార్చన చేయించి మొక్కు తీర్చుకుంది అన్నపూర్ణమ్మ.

*

సంధ్యవేళ బజారు వీధి దాకా వాకింగ్‌కి వెళ్ళి వచ్చిన సూరప్పగారు, తమ వీధరుగు మీద శాస్త్రిలుగారు కూర్చునుండటం, అన్నపూర్ణమ్మగారు చేతిలో "స్త్రీల వ్రత కథలు" పుస్తకాన్ని పట్టుకుని ఆయనతో మాట్లాడుతూ నిల్చునుండటం చూసి—

"ఏవిటి విశేషం శాస్త్రులుగారూ? ఇలా వచ్చారు?" అనడిగారు.

"అమ్మగారు యేదో వ్రతం చేసుకోవాల్నుందని కబురుపెడితే యిలా వచ్చాను" ఆయన మాట మధ్యలోనే అన్నపూర్ణమ్మ అందుకుని—

"కైలాసగౌరి నోము నోచుకుందామని, వివరాలు తెలుసుకోవడానికి వారికి కబురు చేశాను." అంది.

"అమ్మా! మరి నేను శలవు తీసుకుంటాను. నేను చెప్పినవన్నీ గుర్తువుంటాయిగా! నేను మంచి రోజు చూసి చెప్తాను. ఆ రోజు నోము పట్టవచ్చు" అంటూ శాస్త్రిలుగారు శలవు తీసుకుని వెళ్ళిపోయారు.

"ఉన్నట్టుండి నోముల మీదికి పోయిందేం మనసు?" అనడిగారు సూరప్పగారు భార్యని.

"ఏదో ఒక వ్యాపకం వుండాలిగా! లేకపోతే తోచదు. అన్నట్టు వో రెండు వీశల పసుపు కొమ్ములు తెప్పించి పెట్టండి. వీశడు పసుపు, వీశడు కుంకం తయారుచేయించి అట్టే పెట్టాలి నోముకి! ఆ పసుపు కుంకాల్ని పళ్ళు, తాంబూలంతో, గుడిలోకి వచ్చే ముత్తైదువులకి, మౌనంగా పంచిపెట్టాలిట" అంటూ భర్త మాటని దాట

మల్లె మొగ్గల ముగ్గు

15 చుక్కలు ఒకదాని కొకటి సమాన దూరంలో వుండేలా పెట్టుకోవాలి. తరువాత పైన, కింద ఒక్కొక్క చుక్క చొప్పున విడిచిపెట్టి, ఒక చుక్క వచ్చేవరకూ రెండువైపులా పెట్టుకోవాలి. ముందు తొడిమ, తరువాత రక్షక పత్రాలు ఆ తరువాత మొగ్గ -వేస్తూపోతే చక్కని మల్లెమొగ్గల ముగ్గు తయారవుతుంది. ఇంటి మధ్యలో లక్కరంగులతో వేసుకోవడానికి కూడా ఈ ముగ్గు బాగుంటుంది. తొడిమ, రక్షక పత్రాలకు ఆకుపచ్చ, మొగ్గలకు తెలుపు రంగులు వేసుకోవచ్చును.

—వి. అనసూయ





వేసింది అన్నపూర్ణమ్మ. తన మనసులోని భయాల్ని, సందేహాల్ని భర్త పసికడితే తనని హేళన చేసి, ఆట పట్టించవచ్చనే భయం వుందా విడకి. చావు బ్రతుకులు మానవుల చేతుల్లో లేవని తెలిసినా ఆవిడ తన కోరిక తీరడానికి పూర్తిగా భగవంతుడి మీద ఆధారపడదల్చుకుంది.

*

కైలాస గౌరి నోము విజయవంతంగా ముగించి, "తల్లీ! జగదంబా! నేను పట్టెడు పసుపు కుంకుమలతో అనాయాసంగా చనిపోయేటట్టు ఆశీర్వదించు" అంటూ మనఃస్ఫూర్తిగా వేడుకుంది అన్నపూర్ణమ్మ. తర్వాత వరసగా పండు తాంబూలం నోము, గ్రామ కుంకుమ నోము, పదహారు ఫలాల నోము, ఒకటనేమిటి? 'స్త్రీల వ్రత కథ'ల్లో రాసిన పుణ్యస్త్రీలు తమ అయిదవతనంకోసం చెయ్య తగిన నోములన్నీ పట్టేసింది. అదిగాక ప్రతి శుక్రవారం లలితా సహస్రనామం, కుంకుమార్చన చేస్తున్న భార్య ధోరణి సూరప్పగారికి వింతగా కనిపించింది. ఇంతకు ముందూ పూజాపునస్కారం చేసుకుంటూవుండేదిగానీ, మాణిక్యాంబ పోయిన దగ్గర్నించీ నోములూ, వ్రతాలూ, పూజలూ మరీ యెక్కువ కావడం, భార్య మనసులో వున్న యేదో ఆందోళనని అణుచుకోవటానికేనని, అనిపించిందాయనకి. భార్య మనసులోని ఆరాటమేమిటో ఆయన అట్టే వూహించలేకపోయారు. మాణిక్యాంబ, అన్నపూర్ణమ్మ యించుమించు వొకే వయసువాళ్ళు! మాణిక్యాంబ హఠాత్తుగా పోవడంవల్ల భార్యకి మృత్యుభీతి పట్టుకుని పరలోక చింతనవల్ల యీ పూజలూ, వ్రతాలు మొదలెట్టిందేమోనని అనుకున్నారాయన. ఏదిఏమైనా భార్యకి ప్రస్తుతం స్థలం మార్పు, గాలి మార్పు చాలా అవసరం అనిపించసాగింది సూరప్పగారికి. భార్యని యీ వాతావరణంనించి తప్పించి యెక్కడికి తీసుకువెళ్ళడమా అని ఆలోచించారు. ఆయనకి తను కొద్ది కాలం క్రితం పేపర్లో చూసిన యాత్రా స్పెషల్‌ని గురించి వచ్చిన ప్రకటన గుర్తు వచ్చింది.

*

మూడు నెలల పాటు భార్యా భర్తలు ఉత్తర దేశంలో చూడవలసిన యాత్రా స్థలాలన్నిటినీ చూశారు. కాశీలోని అన్నపూర్ణని, విశాలాక్షిని, విశ్వనాథుడిని, కలకత్తాలోని కాళిని, జగన్నాథంలోని జగన్నాథుడిని అన్నపూర్ణమ్మ చేతులెత్తి వేడుకున్నది వొక్కటే—'పసుపు కుంకుమలతో ముత్తయిదువగా పోయే అదృష్టం నాకు కలిగించు' అని.

యాత్రలు ముగించి స్వస్థలం చేరుకున్న ఆ భార్యా భర్తలు—సత్యన్నారాయణగారు పక్షవాతానికి గురై మంచం పట్టిన సంగతి విని నిర్విణ్ణులై పోయారు. రెండు రోజులు విశ్రాంతి తీసుకుని, మూడో రోజు సాయంత్రం—

"పద! అన్నయ్యని చూసివద్దాం!" అంటూ సూరప్పగారు భార్యని బయలుదేర తీశారు. మాణిక్యాంబ పోయిన తర్వాత చాలా కాలానికి మళ్ళీ అన్నపూర్ణమ్మ ఆ గడపలో కాలు పెట్టింది.

"రండి పిన్నిగారూ! చాలా రోజులకి యిటు వచ్చారు" అంటూ మాణిక్యాంబ పెద్ద కోడలు సరోజ ఆహ్వానించింది.

"ఈ మధ్య యాత్రలకి వెళ్ళేమమ్మా! తిరిగి వచ్చేసరికి మీ మావఁగారి అనారోగ్యం సంగతి తెల్సింది. మీ అత్తగారు పోవటమే ఆయన్ని మానసికంగా కృంగదీసి వుంటుంది. ఏరీ? హాస్పిటల్లో చేర్పించారా?" అన్న అన్నపూర్ణమ్మ ప్రశ్నకి సరోజ ఆవిడవైపు అదోలాగ చూసి—



"ఆస్పత్రిలో చేర్పిస్తే యిదేమైనా తగ్గే రోగమా? కాలూ చెయ్యీ వున్న నాడే ఆయనకి అన్నీ అందించాల్సి వచ్చేది. ఇంక యిప్పుడు చెప్పేదేముందీ? ఈ ముసలాయనకి చాకిరీ చెయ్యలేక యింటిల్లిపాదిమీ ఛస్తున్నామనుకోండి పిన్నిగారూ! ఆయన కంటే ముందు ఆయన చాకిరీ చెయ్యలేక మేము చచ్చేటట్టు వున్నాము." అంటూ వాళ్ళని మావఁగారి గదిలోకి తీసుకెళ్ళింది. సత్యన్నారాయణగారి పరిస్థితి చూసి అన్నపూర్ణమ్మ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. మాణిక్యాంబ బ్రతికున్న రోజుల్లో సత్యన్నారాయణగారు పులిలా వుండేవారు. ఆయనకి సహజంగా కోపం కాస్త యెక్కువ అవటంచేత, మాణిక్యాంబ హడలుతూ ఆయన అవసరాలన్నీ చూసేది. కొడుకులు తండ్రి ముందు నోరెత్తేవారు కాదు. కోడళ్ళు గట్టిగా మాట్లాడటానికి జంకేవారు. అలాంటి మనిషి ప్రస్తుతం వొక కాలు, చెయ్యి, నోరు పడిపోయి, సరిగ్గా గాలి వెలుతురూ రాని చీకటి కొట్లో దయనీయమైన స్థితిలో పడి వున్నాడు. సూరప్పగార్ని, అన్నపూర్ణమ్మని చూడగానే సత్యన్నారాయణగారి కళ్ళు ఆనందంతో మెరిసి, అంతలోనే నీళ్ళతో నిండిపోయాయి. కుడిచేతితో ఆప్యాయంగా సూరప్పగారి చేతులు తడుముతూ రోదిస్తున్న ఆయన్ని చూసి సరోజ తిరస్కారంగా —

"మనిషి దగ్గరకి వస్తే చాలు జలగలాగ పట్టుకోవడం! ఇంటి కెవరొచ్చినా యీ యేడుపు వొకటి! అక్కడికి మేమేదో ఆయన్ని నానా బాధలూ పెట్టేస్తున్నట్టు...." అంది. సరోజ మాటలకి అన్నపూర్ణమ్మ మనసు చివుక్కుమంది. అక్కడున్న బల్ల మావఁగారి మంచానికి దగ్గరగా జరిపి, "కూర్చోండి బాబాయిగారూ! కాఫీకి నీళ్ళు పడేసి యిప్పుడే వస్తాను." అంటూ సరోజ గది వదలి వెళ్ళిపోయింది. విసవిస నడిచిపోతున్న సరోజ వేపు వింతగా చూసింది అన్నపూర్ణమ్మ. సత్యన్నారాయణగారు నోరు తెరిచి చెప్పలేకపోయినా, ఆయనకి ఆ యింట్లో యెలాంటి ఆదరణ లభిస్తోందో, ఆ గది వాతావరణం చూస్తే తెలుస్తోంది. హఠాత్తుగా అన్నపూర్ణమ్మకి, మాణిక్యాంబ బ్రతికి వున్న రోజుల్లో వొకసారి సత్యన్నారాయణగారికి జబ్బు చేసిన సంగతి గుర్తుకి వచ్చింది. సత్యన్నారాయణగారి వీపు మీద నారకురుపు వేసి చాలారోజులు నానా బాధపడ్డాడాయన, అప్పుడు మాణిక్యాంబ ఆయన్ని కంటికి రెప్పలా, కన్నతల్లిలాగ కాపాడి సేవ చేసింది. ఆ బాధలో అసలే కోపిష్టి మనిషైన ఆయన, ఆవిడని నానా తిట్లూ తిట్టేవాడు. దగ్గరకి వస్తే కొట్టేవాడు గూడా! అయినా ఆవిడ నోరెత్తేది కాదు. ఆవిడే బ్రతికి వుంటే ఆయన స్థితి యిలా వుండనిచ్చేదా? ఇలా కోడలు నోరు మెదిపే అవకాశం యిచ్చి వుండేదా? ఈ రొచ్చులో నోరూ, కాలూ, చెయ్యి లేని యీ మనిషిని యిలా ఆయన ఖర్మానికి పడి వుండమని, ఆ పుణ్యాత్మురాలు తన దారి తను చూసుకుంది. అన్నపూర్ణమ్మ స్నేహితురాల్ని తలుచుకుని గాఢంగా నిట్టూర్చింది. జీవన సంధ్యలో భార్యాభర్తలకి వొకరి అండదండలు మరొకరికి యెంత అవసరమో అని అనిపించిందావిడకి. సరోజ కాఫీ తీసుకువస్తూ గదిలో లైటు వెయ్యడంతో అన్నపూర్ణమ్మ అలవాటు ప్రకారం చటుక్కున మంగళసూత్రాలు తీసి కళ్ళకద్దుకుంటూ —

"భగవాన్! పట్టెడు పసుపు కుంకుమలతో పుణ్యస్త్రీగా పోయే అదృష్టాన్ని నాకు అనుగ్రహించు." అనుకోబోయి — గతుక్కుమని ఆగిపోయింది! ఛీ! తనెంత స్వార్థపరురాలు? భర్తని వంటరి పక్షిని చేసి నిర్దాక్షిణ్యంగా యీ లోకంలో వదిలేసి పోవాలనుకుంటోంది. తన స్వార్థం కోసం పూజలు చేసేస్తోంది, కనిపించిన దేవుళ్ళందరికీ మొక్కుకుంటోంది. తనకిది తగునా? తను లేకపోతే తన భర్తకి కాలూ చెయ్యి నొస్తే యెవరు చేస్తారు? ఎవరు చూస్తారు? రోగిష్టి మనిషి, కన్నబిడ్డలకి బరువైనా భార్యకి బరువు కాదు! ఇప్పుడు అన్నయ్య వున్న పరిస్థితిలో తన భర్త వుంటే కనీసం యిన్ని నీళ్ళు నోట్లో పోసే దిక్కైనా లేక అల్లాడి పోరా? తనదెంత కఠిన హృదయమై వుండాలి?

"వద్దు! వద్దు! భగవాన్ నా భర్తకి అలాంటి స్థితి రాకూడదు. ఎలాంటి బాధలైనా, యెన్నైనా నేను పడతాను. అంతేగాని ముత్తైదువగా పోవాలనే కోరికతో నా భర్తని వంటరిగా యీ లోకంలో బాధలు పడమని వదలలేను. ఓ పరాత్పరా! చివరంటా ఆయన సేవ చెయ్యగలిగే మనోధైర్యాన్ని, బలాన్ని నాకు ప్రసాదించు తండ్రీ!" అంటూ మనఃస్ఫూర్తిగా ఆ సంధ్య వేళలో దైవాన్ని ప్రార్థించింది అన్నపూర్ణమ్మ! □

వైద్య విశేషాలు

కుష్ఠు వ్యాధి నివారణకు దోహదం చేసే వైద్య పరిశోధనలలో భారతీయ వైద్యులు ఇటీవల చెప్పుకోదగ్గ విజయాన్ని సాధించారు. కుష్ఠువ్యాధికి కారణమని భావించే క్రిములపై ప్రయోగాలు జరుపుతున్న భారతీయ వైద్య పరిశోధనామండలి — పరిశోధనా విభాగానికి చెందిన డాక్టర్ ఎన్. వీరరాఘవన్, శ్రీమతి సావిత్రీ సుకుమార్ తాము జరిపిన ప్రయోగాల గురించి ఈ మధ్య కొన్ని వివరాలు వెల్లడి చేశారు. ఈ వ్యాధి వ్యాప్తి చెందడానికి కారణభూతమని భావించే ఎమ్. లెప్రాయ్ అనే క్రిములపై పరిశోధనలు జరిపి, ఆ క్రిములను పెంపు చేయడం జరిగిందని, వీటివల్లే రోగవ్యాప్తి జరుగుతుందన్న విషయం పూర్తిగా నిర్ధారణ అయిన తర్వాత, వ్యాధి నివారణకు ఒక వాక్సిన్‌ను ఉత్పత్తి చేయడానికి అవకాశం వుంటుందనీ వారు చెప్పారు. కుష్ఠు నివారణకు ప్రపంచమంతటా చాలా కాలంగా జరుగుతున్న పరిశోధనలలో ఈ పరిశోధన ఒక విశేషమైన మలుపుగా వైద్య శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

*

మధుమేహ వ్యాధిగ్రస్తులు - తమ దేహంలోని 'బ్లడ్ షుగర్' పరిమాణం తెలుసుకోడానికి, తమకు ఎంత 'ఇన్సులిన్' అవసరమో నిర్ణయించుకోడానికి అనువుగా 'పాకెట్ కాలిక్యులేటర్' సైజులో ఒక సాధనాన్ని బ్రిటిష్ వైద్యశాస్త్రజ్ఞులు రూపొందించారు. లండన్‌లోని సెయింట్ థామస్ హాస్పిటల్ అండ్ మెడికల్ స్కూల్‌కు చెందిన డా॥ పి. హెచ్. సోంక్సెన్, ఆయన సహాయకులు రూపొందించిన ఈ సాధనాన్ని ఒక బ్రిటిష్ సంస్థ ఇప్పుడు విక్రయిస్తున్నది. వెల కూడా అంత ఎక్కువ కాదట!

*

చైనాకు చెందిన వైద్య పరిశోధకులు సంతానోత్పత్తిని నివారించడానికి మగవారు ఉపయోగించే 'గాసిపోల్' అనే గుళికను ఇటీవల కనుగొన్నారు. ఈ గుళిక తయారీకి అవసరమైన పదార్థాలను ప్రత్తి విత్తనాల నుంచి సేకరించి తయారు చేయడం జరిగిందని, ఎన్నో ప్రయోగాల అనంతరం దీనివల్ల ఆరోగ్యానికి ఎలాంటి హాని కలగదని రుజువైందనీ నవచైనా వార్తాసంస్థ వెల్లడి చేసింది. ఈ వైద్య విశేషం పట్ల రాక్ ఫెల్లర్ ఫౌండేషన్, పాపులేషన్ కౌన్సిల్‌వారు విశేషమైన ఆసక్తి చూపి, చైనా వైద్యపరిశోధకులతో కలిసి, 'గాసిపోల్'కు సంబంధించిన అన్ని వివరాలు సేకరిస్తున్నారు.